నందకుమార్‌ను విచారించిన పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో నిందితుడైన నందకుమార్‌ను బంజారాహిల్స్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఫిలింనగర్‌లోని డెక్కన్ కిచెన్ వ్యవహారానికి సంబంధించి అతని మీద ఆరోపణలు రావడంతో కస్టడీ కోరుతూ నాంపల్లి కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. విచారించిన కోర్టు రెండ్రోజుల కస్టడీకి అనుమతించింది. ఈ మేరకు చంచల్‌గూడ జైలులో ఉన్న నందకుమార్‌ను బంజారాహిల్స్ పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించారు. బంజారాహిల్స్ ఎసిపి సుదర్శన్, సిఐ నరేందర్ అడ్వకేట్ సమక్షంలో విచారణ జరిగింది. మొదటి రోజు విచారణ పూర్తి చేసి తిరిగి నందకుమార్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. మంగళవారం రెండో రోజు కూడా అతన్ని విచారించనున్నారు. డెక్కన్ కిచెన్ వ్యవహారంలో నందకుమార్‌పై ఇప్పటికే ఐపిసి సెక్షన్లు 406,420,506 కింద పోలీసులు కేసులు నమోదు చేశారు.

చంపిస్తానని ఎమ్మెల్యే బెదిరిస్తున్నారు

- కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సంచలన ఆరోపణలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ ఉప్పల్‌లో అధికార టిఆర్ఎస్ పార్టీలో కొన్నాళ్లుగా అంతర్గతంగా రగులుతున్న విభేదాలు ఒక్కసారిగా బయటపడ్డాయి.. రౌడీలు, గుండాలతో తనను చంపిస్తానని ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి బెదిరిస్తున్నారని ఆ పార్టీ చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సంచలన ఆరోపణలు చేశారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. కాప్రా సర్కిల్ కుషాయిగూడలో రూ.54 లక్షలతో మరమ్మతులు చేసి, కొత్త మిషనరీతో మోడల్ దోబీఘాట్‌ను కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి ప్రారంభించారని తెలిపారు. అయితే, ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి ప్రొటోకాల్ పాటించలేదని ఆరోపించారు. స్థానిక కార్పొరేటర్‌ను అయిన తాను లేకుండా దోబీఘాట్‌ను ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. బిసి మహిళా కార్పొరేటర్‌ను అయిన తనను మర్యాద లేకుండా ఎమ్మెల్యే దూషిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి గ్రూపు రాజకీయాలు చేస్తూ పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శించారు. ఇతర మహిళల వద్ద తన గురించి పిచ్చి పిచ్చి మాటలు, బూతులు మాట్లాడుతున్నారని, అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకుంటూ అధికారులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే పద్ధతి మార్చుకోకపోతే సహించేది లేదని కార్పొరేటర్ హెచ్చరించారు. తనను నాన్ లోకల్ అని ముద్ర వేసి కులం పేరుతో అవమానిస్తే ఊరుకోబోమన్నారు. ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు, తనపై నిత్యం అసత్య ఆరోపణలు, బూతులు తిడుతున్న వైనంపై సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

త్వరలో యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో విద్యుదుత్పత్తి

- పనులు పరిశీలించిన సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంటు నిర్మాణ పనులను సోమవారం సిఎం కె.చంద్రశేఖర్‌రావు పరిశీలించారు. హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం ఒంటిగంటకు థర్మల్ పవర్ ప్లాంటుకు వచ్చారు. హెలికాప్టర్ ద్వారా ఏరియల్ వ్యూ పరిశీలించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో ప్లాంట్‌లో తిరిగి పరిశీలించారు. రూ.29.965 కోట్లతో 4 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యంగా నిర్మిస్తున్న 5 యూనిట్ల పనులను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో అధికారులకు నిర్మాణ పనులపై దిశా నిర్దేశం చేశారు. త్వరితగతిన పనులను చేసి 2023 నాటికి పూర్తి చేయాలని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే సంవత్సరం విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించేలా చూడాలని సూచించారు. ఇప్పటికే రెండు యూనిట్లు 90 శాతం, మిగతా 3యూనిట్లు 70 పనులు పూర్తి అయ్యాయి. కాగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ ముందుకు పోవాలని చెప్పారు. సిఎం వెంట రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు, జెన్‌కో సిఎండి ప్రభాకర్‌రావు, శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు

సిఎం పర్యటన నేపథ్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. దామరచర్ల నుంచి పవర్ ప్లాంట్ వరకు సుమారు 6 కిలోమీటర్ల వరకు పోలీసులను మోహరించారు. ప్లాంట్ గెట్ వద్ద కూడా భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

జర్నలిస్టులకు నో ఎంట్రీ

కెసిఆర్ పర్యటనను కవర్ చేయడానికి ప్లాంట్ వద్దకు వెళ్లిన ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులను లోపలికి వెళ్లనివ్వలేదు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు జర్నలిస్టులు ప్లాంట్ ఎదుట నిల్చోవాల్సి వచ్చింది. దీంతో జర్నలిస్టులు కొంత అసహనానికి గురయ్యారు.

ప్రత్యేక జిల్లా కోసం ఆందోళన

మిర్యాలగూడను ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని కొందరు సిఎం పర్యటన సందర్భంగా యాదాద్రి పవర్ ప్లాంట్ వద్ద ప్లకార్డులు ప్రదర్శించారు. అన్ని రకాలుగా అర్హతలు ఉన్న మిర్యాలగూడను జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పోలీసులు వారిని అడ్డుకొని బలవంతంగా అక్కడి నుంచి వాహనాల్లో తరలించారు.

సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్

'కిరాయికిచ్చినా.. తాళం వేసినా' వాపస్

- మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెసిఆర్ నగర్‌లో లబ్ది పొందిన లబ్దిదారులు ఇళ్లు కిరాయి ఇస్తే, తాళం వేస్తే.. వాపస్ తీసుకుంటామని మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలోని కెసిఆర్‌నగర్‌లో 33/11 కెవి విద్యుత్తు ఉప కేంద్రం నిర్మాణ పనులు, కెసిఆర్ నగర్ పోచమ్మ దేవాలయ ఆవరణలో కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు, కెసిఆర్ నగర్-గుండ్ల చెరువులకు 1.50లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన మంచినీటి ట్యాంక్ పనులకు సోమవారం మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేయడంతో పాటు పోలీసు ఔట్‌పోస్ట్‌ను ప్రారంభించారు. అదేవిధంగా రెడ్డి సంక్షేమ భవన్‌లో పట్టణంలోని 300 మంది లబ్దిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే పేద ప్రజలకు గృహ సముదాయం కేవలం సిద్దిపేటలోనే ఉన్నదని అన్నారు. ప్రజావసరాలకు అనుగుణంగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సిఎం కెసిఆర్ ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదన్నారు. ఆదర్శవంతమైన చక్కటి కాలనీ నిర్మించి ఒక్కొక్కటిగా సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని, 2450 ఇండ్ల కాలనీ తక్కువ సమయంలో తీర్చిదిద్దుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కాలనీ ఏర్పాటయ్యాక అంగన్‌వాడీ, రేషన్ షాపు, పాఠశాల, నీటి ట్యాంక్‌లతో పాటు అదనంగా 1.50లక్షల లీటర్ల మూడవ నీటి ట్యాంక్ పనులు ప్రారంభం చేసుకున్నామని తెలిపారు. లో ఓల్టేజీ లేకుండా రూ.5.42 కోట్లతో 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేసినట్టు, పట్టణంలో ఇది 7వ సబ్ స్టేషన్‌నని, నియోజకవర్గంలో 44వ సబ్‌స్టేషన్ అని తెలిపారు. పోలీసు ఔట్ పోస్ట్‌తో ఇక్కడి ప్రజలకు భద్రత ఉంటుందని అన్నారు. మరో వెయ్యి ఇండ్ల నిర్మాణం ప్రారంభం చేస్తున్నట్టు తెలిపారు. ఎల్అండ్‌టి శిక్షణా కేంద్రం ద్వారా యువతకు శిక్షణ ఇచ్చి, ఉద్యోగం సైతం ఇప్పిస్తామని తెలిపారు. త్వరలోనే గ్రూప్-4 కోసం 10 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేయనున్నట్టు చెప్పారు. క్రమశిక్షణ కలిగిన కాలనీగా పెద్దలు సహకరించాలని కేసీఆర్ నగర్ కాలనీ వాసులను కోరారు. కార్యక్రమంలో జెడ్‌పి చైర్మెన్ రోజాశర్మ, పోలీసు కమిషనర్ శ్వేత, మాజీ మున్సిపల్ చైర్మెన్ రాజనర్సు, సుడా చైర్మెన్ రవీందర్ రెడ్డి, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యులు పాల సాయిరాం, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న అధికారులు

శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు రూ.50లక్షల చెక్కు అందజేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం ఎర్రబోడు ఘటనలో మృతి చెందిన ఎఫ్ఆర్ఒ చలమల శ్రీనివాసరావు కుటుంబానికి ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రకటించిన రూ.50 లక్షల పరిహారాన్ని అటవీశాఖ చీఫ్ కంజర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ భీమా నాయక్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం డీఎఫ్ఒ సిద్దార్థ విక్రమ్ సింగ్ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని, భయపడాల్సిన అవసరం లేదని, శాఖ తరపున అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం, ఇతర అన్ని హామీలను సకాలంలో అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మెన్ విజయ్ కుమార్, బిసిసిబి చైర్మెన్ కురాకుల నాగభూషణం, ఎంపిపి భూక్య గౌరి, తహసీల్దార్ జి.నర్సింహారావు, ఎఫ్ఆర్ఒ రాధిక, మంత్రి పిఎ సిహెచ్.రవికిరణ్, నాయకులు మందడపు నర్సింహారావు, కుర్రా భాస్కర్‌రావు, కొంటెముక్కల వెంకటేశ్వర్లు, మందడపు సుధాకర్ ఉన్నారు.

వైఎస్ షర్మిల పాదయాత్రలో తీవ్ర ఉద్రిక్తత

- షర్మిల కేరవ్యాన్‌కు నిప్పుపెట్టిన టిఆర్ఎస్ కార్యకర్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలో కొనసాగుతున్న వైఎస్ షర్మిల ప్రజా ప్రస్థానం పాదయాత్రలో సోమవారం ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. ప్రజాప్రస్థానం యాత్రలో భాగంగా ఆమె ఆదివారం నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. అవే వ్యాఖ్యలు సోమవారం కూడా కొనసాగడంతో టిఆర్ఎస్ కార్యకర్తలు పాదయాత్రపై దాడికి యత్నించారు. 'షర్మిల గోబ్యాక్' అంటూ నినాదాలు చేయడంతో టిఆర్ఎస్, వైఎస్ఆర్‌టిపి కార్యకర్తలు మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. పరస్పరం దూషణలు, దాడులకు దిగడంతో పాటు పాదయాత్ర బస్సును తగలబెట్టేందుకు యత్నించి వాహనాల అద్దాలు ధ్వంసం చేశారు. దాంతో టిఆర్ఎస్ కార్యకర్తలు, టిఆర్ఎస్ గుండాలను అరెస్టు చేయాలంటూ వైఎస్సార్‌టిపి కార్యకర్తలు రోడ్డుపై బైటాయించి భారీఎత్తున రాస్తారోకో చేశారు. దాంతో భారీగా పోలీసులు మోహరించారు. పోలీసుల జులుం నశించాలని, సిఎం కెసిఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాంతో కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జ్ చేశారు. ఈ నేపథ్యంలోనే షర్మిలను పోలీసులు అరెస్ట్ చేసినట్టు తెలుస్తోంది.

వివరాల్లోకి వెళితే.. సోమవారం ఉదయం చెన్నారావుపేట మండల కేంద్రానికి షర్మిల పాదయాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా సిఎం కెసిఆర్, రాష్ట్రంలోని ఎమ్మెల్యేలపై షర్మిల సంచలన వ్యాఖ్యలు చేయడంతో పాటు స్థానిక ఎమ్మెల్యే పెద్దిని టార్గెట్ చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. అభివృద్ధిలో పెద్దిది చిన్నబుద్ధి అని, భూ దందాలో పెద్ద బుద్ధి అని విమర్శించారు. ఎమ్మెల్యేకి నియోజకవర్గ ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టాలని కోరారు. పాకాల వాగు వంతెన నిర్మిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే దాన్ని నిలబెట్టుకోలేని, చెన్నారావుపేట ప్రధాన రహదారి చూస్తుంటేనే పెద్ది పని తీరు కనపడుతుందంటూ విమర్శించారు. వైఎస్ఆర్ వేసిన రోడ్లే ఇప్పటికీ ప్రజలకి దిక్కుగా మారాయన్నారు. తాగునీరు లేక ప్రజలు నానా అవస్థ పడుతున్నారని, మంచినీరు ఇవ్వలేని దిక్కుమాలిన ఎమ్మెల్యే ఎందుకని ప్రశ్నించారు. రాళ్ల వానతో 20 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగితే ఒక్క రైతునైనా ఆదుకున్నారా అని ప్రజలను అడిగి మరి చెప్పించారు. అనంతరం యాత్ర ముందుకు సాగుతూ లింగగిరి క్రాస్ రోడ్డు వద్దకు చేరుకున్న క్రమంలో టిఆర్ఎస్ కార్యకర్తలు పాదయాత్రపై దాడికి యత్నించారు.

విమానయానం ధరలోనే అంతరిక్షయానం..!

- స్కైరూట్ ఏరోస్పేస్ కో ఫౌండర్ వెల్లడి

హైదరాబాద్ : విమానయానం ధరలోనే అంతరిక్షయానం అందు బాటులోకి రావడానికి ఎంతో దూరం లేదని స్కైరూట్ ఏరోస్పేస్ కో ఫౌండర్ పవన్ కుమార్ చందన అన్నారు. ఇటీవల ఈ సంస్థ దేశంలోని తొలి ప్రయివేటు రాకెట్‌ను రూపొందించి వార్తల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. వచ్చే పదేళ్లలో భారత పర్యాటకులు కూడా అంతరిక్షయానం చేయడానికి వీలుందని పవన్ కుమార్ పేర్కొన్నారు. భారత రాకెట్ సిటీగా హైదరాబాద్ ఆవిర్భవించనుందన్నారు. సోమవారం నగరంలో ఫిక్కీ లేడిస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్ఒ) ఏర్పాటు చేసిన ఓ చర్చా సమావేశంలో పవన్ కుమార్ మాట్లాడుతూ.. దేశీయ స్పేస్ టెక్నలాజీలో తెలుగు రాష్ట్రాల వాటా కీలకంగా ఉందన్నారు. 500 కిలోల లోపు చిన్న శాటిలైట్‌ల తయారీపై తాము దృష్టి కేంద్రీకరిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో పాలసీ బజార్ సహ వ్యవస్థాపకులు అలోక్ బన్సల్, రాపిడో సహ వ్యవస్థాపకులు పవన్ గుంటుపల్లి, ఎఫ్ఎల్ఒ హైదరాబాద్ ఛైర్‌పర్సన్ సుబ్రా మహేశ్వరి పాల్గొని మాట్లాడారు.

పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలి

- ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్ డిమాండ్
- హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేద ప్రజల కోసం ప్రభుత్వం కట్టించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే పంపిణీ చేయాలని ప్రజాసంఘాల పోరాట వేదిక, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్ డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల పోరాట వేదిక హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అబ్బాస్ మాట్లాడుతూ.. సైదాబాద్, బండ్లగూడ, చార్మినార్, బహుదూర్ పురా, గోల్కొండ, నాంపల్లి, ఆసిఫ్‌నగర్ తదితర మండలాల్లో ఇండ్లు లేని పేదలు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం గతంలో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ప్రజలందరికీ సోషియో ఎకనామికల్ సర్వే (ఎస్.ఈ.ఎస్) నిర్వహించి కలెక్టర్ హౌసింగ్ సొసైటీకి పంపారని, అక్కడ ఏండ్లుగా పెండింగ్‌లో ఫైల్స్ ఉన్నాయని తెలిపారు. ఈ మధ్యకాలంలో అధికారులు మళ్లీ విచారణ చేశారు కానీ ఇండ్ల పంపిణీ మాత్రం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు వాంబే స్కీంలో కానీ, జెఎన్‌యుఆర్ఎం, డబుల్ బెడ్ రూమ్ స్కీముల్లోగానీ ఇండ్లు ఇస్తారని ఎదురుచూస్తున్నారని, కానీ ఏ ఒక్కరికీ ఇల్లు ఇవ్వలేదని చెప్పారు. ఇంటి కిరాయి చెల్లించలేక పేదలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే లబ్దిదారులందరికీ ఇండ్లు అందజేయాలని డిమాండ్ చేశారు. ఇలానే ఆలస్యం చేస్తే రానున్న రోజుల్లో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.శ్రావణ్ కుమార్, మీనా, ఐద్వా నాయకులు పి.శశికళ, ఆవాజ్ సెక్రటరీ అబ్దుల్ సత్తార్, సిఐటియు నాయకులు పి.నాగేశ్వర్, డివైఎఫ్ఐ నాయకులు ఏ.కృష్ణ, వి.రాంకుమార్, విఠల్, జంగయ్య, ప్రజలు పాల్గొన్నారు.

పూలే స్ఫూర్తితో పాలన

- టిఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహాత్మా జ్యోతిరావు పూలే స్ఫూర్తితో సిఎం కెసిఆర్ తెలంగాణ ప్రజలకు అద్భుతమైన పాలన అందిస్తున్నారని టిఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పూలే చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలు అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ దేశానికి తెలంగాణను మోడల్‌గా చేశారని కొనియాడారు. బడుగుల పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, కలెక్టర్లు కావాలని సిఎం కెసిఆర్ ఆకాంక్ష అని పేర్కొన్నారు. పూలే ఆశించిన నవ సమాజ నిర్మాణానికి సిఎం కృషిచేస్తున్నారని తెలిపారు. సామాజిక రుగ్మతలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా తెరాస ప్రభుత్వం ముందుకు పోతుందని పేర్కొన్నారు. సామాజిక అసమానతలు తొలగించేందుకు పూలే అవిశ్రాంతంగా పోరాడిన మహనీయుడనీ, ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకెళ్లడమే నిజమైన నివాళి అని తెలిపారు.

గ్రామ సభలే కీలకం

- పోడు భూముల హక్కు పత్రాలిచ్చేందుకు..
- చట్టంలో ఉన్న అంశాలను తీసుకోండి
- పలు గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఐటిడిఎల ముట్టడి

వై జంక్షన్ నుంచి ర్యాలీగా వస్తున్న ఆదివాసీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోడు భూములకు ప్రభుత్వం హక్కు పత్రాలు ఇచ్చేందుకు శాటిలైట్ మ్యాప్‌ను ప్రధాన ఆధారంగా తీసుకోవద్దని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం, తుడుందెబ్బ, తదితర సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఐటిడిఎ ముట్టడిని నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లాలో టిఏజిఎస్ ఆధ్వర్యంలో ఐటిడిఎ వరకు ర్యాలీ నిర్వహించి, ఐటిడిఎ ఎదుట నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిఏజిఎస్ కార్యదర్శి ఎర్మ పున్నమ్ మాట్లాడుతూ.. పోడు రైతులందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. హక్కు పత్రాలు ఇచ్చేందుకు గతంలో తీసిన శాటిలైట్ మ్యాప్‌ను ప్రధాన ఆధారం చేసుకోవద్దని, చట్టంలో పొందుపరిచిన అంశాలను మాత్రమే ప్రధాన ఆధారంగా తీసుకొని హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. ఇప్పటివరకు జరిగిన గ్రామాల్లో నామమాత్రపు గ్రామ సభలు నిర్వహించా రన్నారు. తిరస్కరణకు గురైన రైతులు పై కమిటీకి అప్పీల్ చేసుకునే అవకాశం లేకుండా పోయిందని వాపోయారు. వెంటనే అధికారులు, ప్రజాప్రతి నిధులు జోక్యం చేసుకొని ఆదివాసీ పోడు రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. హరితహారం పేరుతో లాక్కొని ప్లాంటేషన్ చేసిన భూములను తిరిగి రైతులకు ఇవ్వాలని కోరారు. పోడు సాగుదారులపైన పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి, ఒక రైతు ఎన్ని చోట్ల భూమి కలిగి ఉంటే అన్ని చోట్ల సర్వే చేసి హక్కుపత్రం ఇవ్వాలని, భూమి లేని నిరుపేదలకు 3ఎకరాల భూమితో పాటు ఇంటి స్థలం లేని వారికి స్థలం కేటాయించి, నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు రాజన్న, రమేష్, శ్రీనివాస్, లక్ష్మి, శంకర్, సమ్మయ్య, అంజయ్య, సతీష్, భారతి, పోడు రైతులు పాల్గొన్నారు.ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని వైజంక్షన్ నుంచి ఐటిడిఎ కార్యాలయం వరకు ఆదివాసీలు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు వట్టం ఉపేందర్, ఆదివాసీల సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ఈసం రామ్మూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కబ్బాక శ్రావణ్ మాట్లాడారు. పోడు భూములను ఆనాదిగా ఆదివాసీలు కాపాడుకుంటూ వస్తున్నారన్నారు. అలాంటి ఆదివాసీలనే అక్రమదారులుగా అటవీశాఖ చిత్రీకరించడం బాధాకరమన్నారు. పోడు చేస్తున్న రైతులకు పెసా గ్రామ సభల్లో తీర్మానం చేసి వారికి హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా చలామణి అవుతున్న మంత్రి సత్యవతిరాథోడ్ ఎస్‌టికే అన్యాయం చేస్తోందన్నారు. ఐటిడిఎ పరిధిలో హక్కు వచ్చిన రైతులకు రైతు బంధు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదువేల మంది దరఖాస్తులు చేసుకున్నా ఇంత వరకు హక్కు పత్రాలు రాలేదన్నారు. పోడు భూములకు సర్వే చేపట్టి హద్దులు పాతాలని కోరారు. ఆదివాసీలకు ఎస్‌టి ధృవీకరణ సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ పొడెం రత్నం, ఎఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు దబ్బగట్ల సుమన్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు చింత కృష్ణ, జిల్లా కార్యదర్శి మడకం చిట్టిబాబు, రాష్ట్ర కార్యదర్శి పాయం జానకిరమణ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలి

- దాడుల నివారణకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలి
- టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సోమయ్య, బసవపున్నయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అర్హులైన జర్నలిస్టులకు వెంటనే ఇండ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించాలని టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బి.బసవపున్నయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లి రాంచందర్, గుడిగె రఘు, రాష్ట్ర కార్యదర్శులు ఎ.నర్సింగ్‌రావు, ఇ.చంద్రశేఖర్, నిరంజన్ కొప్పు, బి.జగదీశ్వర్‌తో కలిసి సోమవారం సోమాజిగుడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆదివారం ఆర్‌టిసి కళ్యాణమండపంలో జరిగిన టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ద్వితీయ మహాసభలో 27 మంది ఆఫీసు బేరర్లు, 28మంది ఇసి మెంబర్లతో కలిపి 55మందితో రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నట్టు తెలిపారు. టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులుగా మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా బి.బసవపున్నయ్య, కోశాధికారిగా ఆర్.వెంకటేశ్వర్లు తిరిగి ఎన్నికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పి.ఆనందం, పి.రాంచందర్, వై.ప్రభాకర్, టి.కృష్ణ, గుడిగ రఘు, బి.రాజశేఖర్, పి.రాధిక, విజయానందరావు, వి.జగన్, మాణిక్‌ప్రభు, బండి విజయ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శులుగా ఎ.నర్సింగ్‌రావు, ఎస్‌కే సలీమా, ఇ.చంద్రశేఖర్, నిరంజన్ కొప్పు, బి.దామోదర్, గంద్ర నవీన్, బి.జగదీశ్వర్, తన్నీరు శ్రీనివాస్, దయాసాగర్, కర్రా అనిల్‌రెడ్డి, భిక్షపతి, కె.వివేకానంద, కె.వెంకటేష్ ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి తిరుమలగిరి సురేందర్, అసిస్టెంట్ ఎన్నికల అధికారి బీఆర్‌కే మూర్తి ప్రకటించారు. ఈ సందర్భంగా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బి.బసవపున్నయ్య మాట్లాడుతూ.. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మహాసభల్లో జర్నలిస్టుల సమస్యలపై తొమ్మిది తీర్మానాలను ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించినట్టు చెప్పారు. వాటి వివరాలు ఇలా ఉన్నాయి. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించాలి, అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు, మహిళా జర్నలిస్టులపై లైంగిక వేధింపుల నివారణ చట్టం, జర్నలిస్టులపై దాడులను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం, జర్నలిస్టులకు ఆరోగ్యబీమా, ప్రమాద బీమా కల్పించాలి. జర్నలిస్టుల ఆరోగ్య కార్డులు అన్ని ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలయ్యేలా చర్యలు, దళిత బంధు తరహాలో జర్నలిస్టు బంధు, జర్నలిస్టుల పెన్షన్ పథకాన్ని అమలు చేయాలి. చిన్న పత్రికలు, డిజిటల్ మీడియాను ప్రభుత్వం గుర్తించాలి.

మహారాజశ్రీ తెనాలి XI వ అడిషినల్ డిస్ట్రిక్టు సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ.నెం.785/2017 ఇన్ ఎ.యస్.నెం.4/2012
బిట్వీన్:
Uriti Subba Rao ...పిటీషనర్/అప్పిలెంట్
ఎదిరి
Uriti Venkateswarlu and others
...రెస్పాండెంట్స్
To,
R5 Uriti Sivaiah, S/o Late Sambaiah
R6 Valluri Venkata Ratnam,
W/o Koteswara Rao,
Both are R/o Sai Mess, Krishna Nagar, D.No. 513-632, Near Annapurna Studio, Near shop no.8-3-231/A, 47/II, Hydarabad
పై నెంబరు ఐ.ఎ 785/2017 పిటీషన్‌లో మీకు శ్రీ కోర్టుద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు పంపవలసినదిగా పై కోర్టువారు ఆర్డరు వేస్తూ ది.7-12-2022వ తేదీకి వాయిదా వేసి యున్నారు. సదరు వాయిదా రోజు ఉదయం గం.10-30ని॥లకు మీరు స్వయంగా గానీ, మీ తరపు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టు వారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల సదరు పిటీషన్‌ను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)
వాయిదా:7-12-2022
దరిశి శివ కోటేశ్వరరావు,
పిటీషనర్/అప్పిలెంట్ తరపు అడ్వకేట్,
డోర్.నెం.22-18-5, పట్టాభి రోడ్,
కొత్తపేట, తెనాలి-522201,
సెల్.నెం.9440631520.

NOTICE
IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE : TADEPALLIGUDEM
I.A.No.124/2022 in A.S.No. 6/2010
Between:
1) Edupalli Rama Rao(died)
2) Boosarapu Sridevi and others
...Petitioners /Proposed Parties
AND
1) Edupalli Atchyuta Ramayya(died), 2. Edupalli Durga Rao and others
...Respondents /Respondents
To:
RESPONDENT/RESPONDENT No.7:
7) Yadla Jyothi, W/o. Ravikumar, Age 59, Hindu, Female, Husband's protection, D.No. 1-2-26, Plot No. 204, Sai Vishnu Apartments, Domalaguda. Ganganmahal, Road No. 6, Hyderabad City Civil Courts.
Please take notice that the above I.A.No. 124/2022 is filed to implead the petitioners 2 to 4 as appellants 2 to 4 in the main appeal as the legal representatives of the deceased appellant. The matter is posted for the appearance of the above 7th respondent on **dt.03-01-2023 from 10:30 AM.** onwards, on which day you may appear in person or through your advocate and file your objections /pleadings if any. Otherwise the matter will be adjudicated according to law in your absence.
G.SYAMA PRASAD MUKHERJEE,
N.SURYA MANI,
Tadepalligudem, 19-11-22.
Advocates, Tadepalligudem.

మోడీ పాలనలో రైతు బతుకు ధ్వంసం

- అన్నదాతలు ఏకమైతే బిజెపి సర్కార్ పతనమే
- సంపద సృష్టించేది రైతులు, కౌలు రైతులే
- రైతు బీమాలో అర్హత వయస్సు పెంచాలి
- ఎఐకెఎస్ సహాయ కార్యదర్శి డాక్టర్ విజ్జు కృష్ణన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పారిశ్రామికవేత్తలకు, పెట్టుబడిదారీ వర్గాలకు, కార్పొరేట్లకు, భూస్వాములకు లబ్ధి చేకూర్చే విధానాలను అనుసరిస్తూ.. రైతులు, వ్యవసాయ కార్మికుల జీవనోపాధిని ప్రధాని మోడీ ధ్వంసం చేస్తున్నారని ఎఐకెఎస్ సహాయ కార్యదర్శి డాక్టర్ విజ్జు కృష్ణన్ విమర్శించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఏచూరి గార్డెన్‌లో మల్లు స్వరాజ్యం నగర్, మాలి పురుషోత్తంరెడ్డి, గొర్ల ఇంద్రారెడ్డి ప్రాంగణంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర రెండో మహాసభ రెండో రోజు సోమవారం కొనసాగింది. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జెండాను ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపానికి రైతు సంఘం నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ మహాసభకు వివిధ జిల్లాల నుంచి 800 మంది రైతు నాయకులు హాజరయ్యారు.

అనంతరం మహాసభలో డాక్టర్ విజ్జుకృష్ణన్ మాట్లాడుతూ.. బిజెపి ప్రభుత్వం శ్రామిక ప్రజలకు, ముఖ్యంగా రైతు, వ్యవసాయ కార్మికులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నదన్నారు. 'అచ్ఛేదిన్' నినాదంతో ప్రజలను మోసగిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ ప్రయివేటీకరణ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. కౌలు రైతులను గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలు అమలు చేయాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలకు బడ్జెట్ నుంచి నిధులు కేటాయించి నష్టపరిహారాన్ని అంచనా వేసి చెల్లించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న రైతు బీమాలో 18-59 సంవత్సరాల వయస్సు రైతులకే బీమా ప్రీమియం చెస్తుందని.. అలా కాకుండా దాన్ని 70 ఏండ్ల వయస్సు వరకు పెంచాలని డిమాండ్ చేశారు. పంటల బీమా పథకం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి అమలు జరపాలని కోరారు. రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలన్నారు. రైతు రుణాలు ఏకకాలంలో మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులను రైతులుగా గుర్తించాలని కోరారు.

అంబానీ, అదానీ వంటి బడా కార్పొరేట్‌లకు రూ.లక్షల కోట్లు రుణమాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వం కౌలు రైతులకు రుణాలు ఇవ్వడానికి కూడా ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంపద సృష్టించే రైతులు, కౌలు రైతులను విస్మరించి దేశ సంపదను కొల్లగొట్టే వారికి మోడీ ప్రభుత్వం రెడ్ కార్పెట్ వేస్తోందన్నారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టేసి పారిశ్రామికవేత్తలకు దోచిపెడుతుండటంతో ప్రజలంతా ఆర్థిక సంక్షోభంలోకి వెళ్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగంపై రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, అనుబంధ రంగాలకు చెందిన చిన్న వ్యాపారులు ఎంతోమంది ఆధారపడి ఉన్నారన్నారు. ఈ రంగం సంక్షోభంలోకి వెళ్లడం వల్ల మెజార్టీ ప్రజలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సేద్యంలో కీలకంగా ఉన్న కౌలు రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించకపోవడం దారుణమన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం రైతులకు ఉత్పత్తి వ్యయంపై 50 శాతం అదనంగా కలిపి కనీస మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో 15 లక్షల మంది కౌలు రైతులు ఉంటే లక్షన్నర మందికి కూడా సిసిఆర్‌సీలు ఇవ్వడం లేదని తెలిపారు. కౌలు రైతుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలని డిమాండ్ చేశారు. రైతులకు కనీస మద్దతు ధర చట్టం తీసుకురావాలని, రుణ విముక్తి చట్టం, సమగ్ర వ్యవసాయం చట్టం కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలని కోరారు. వ్యవసాయ శాఖ ద్వారా కౌలు రైతుల గుర్తింపు జరగాలని, ఇందుకోసం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ సరిహద్దులో 13 నెలలపాటు జరిగిన రైతాంగ ఉద్యమం స్ఫూర్తిగా రాష్ట్రంలో కౌలు రైతులు ఉద్యమించాలని సూచించారు. భూయజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, ప్రభుత్వ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

రైతాంగ సమస్యలపై మరో పోరాటానికి సిద్ధం

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి

వ్యవసాయ రంగం కరువుకాటకాలతో అల్లాడుతోందని, రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై రైతులు మరో పోరాటానికి సిద్ధం కావాలని తెలంగాణ రైతు సంగం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తోన్న విధానాల వల్ల రైతాంగం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటోందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో దేశంలో లక్ష మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కనిపించకపోవడంతో రైతుల ఆదాయం పూర్తిగా దిగజారి పోయిందన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేసి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. పోరాట చరిత్రలో నల్లగొండ జిల్లాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నేటికీ అనేక గుణపాఠాలు నేర్పుతుందన్నారు. మోడీ పభుత్వం ఎరువుల సబ్సిడీని రద్దు చేయాలని, సీసీఐని ఎత్తేయాలని యత్నిస్తోందని, దాన్ని అడ్డుకోవడానికి బలమైన పోరాటాలు చేయాల్సి ఉందని చెప్పారు.

మహాసభకు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, రైతు మహిళా రాష్ట్ర కన్వీనర్ కందాల ప్రమీల, సూర్యాపేట జిల్లా కార్యదర్శి దండ వెంకటరెడ్డి, శెట్టి వెంకన్న, వల్లపు వెంకటేష్, అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. జాతీయ నాయకులు హన్నన్ మొల్ల, సారంపల్లి మల్లారెడ్డి, ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు- నల్లగొండ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ నిబంధనలను ఉపసంహరించుకోవాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గిరిజన మహిళ ద్రౌపది ముర్మును రాష్ట్రపతిని చేశామంటూ గొప్పలు చెప్పుకుంటున్న మోడీ ప్రభుత్వం ఆమె చేతనే ఆదివాసీల కన్నుపొడిచేలా వ్యవహరిస్తున్నదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. తెలంగాణ గిరిజన సమాఖ్య కార్యవర్గ సమావేశాన్ని ఆ సంఘం నాయకులు కుటుంబరావు సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. అటవీ సంరక్షణ నిబంధనలకు అనుమతించేలా చేయడం దుర్మార్గమని అన్నారు. ఈ నిబంధనల ద్వారా రాష్ట్ర ప్రభుత్వాల ప్రమేయం లేకుండా కేంద్ర ప్రభుత్వమే నేరుగా కార్పొరేట్ సంస్థలకు అడవులు, ప్రకృతి సంపదను కట్టబెట్టేందుకు కుట్ర పన్నుతున్నదనీ, ఆదివాసీలకు కనీసం అడవిలో జీవించే హక్కు కూడా లేకుండా చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఆదివాసీల ఉనికినే ప్రశ్నార్థకం చేసే అత్యంత ప్రమాదరకరమైన తిరోగమన చర్య అనీ, అటవీ సంరక్షణ నిబంధనలను ఉపసంహరించుకోవాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అటవీ సంపదను కార్పొరేట్ శక్తుల పరం చేసే కుట్ర జరుగుతున్నదని విమర్శించారు. అటవీ సంరక్షణ నిబంధనల పేరుతో పాత చట్టాలకు మోడీ ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నదని అన్నారు. గిరిజనులు, గ్రామసభలు, రాష్ట్ర ప్రభుత్వ హక్కులను కేంద్రం లాగేసుకుంటున్నదని చెప్పారు. ఫెడరల్ స్ఫూర్తిపై మరోసారి దాడి జరుగుతున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, తెలంగాణ గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, జువారి రమేష్, భూక్యా శ్రీనివాస్, శంకర్, స్వరూప, దస్రు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి మల్లారెడ్డి కుమారుడు, అల్లుడిని విచారించిన ఐటి అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదాయపు పన్ను ఎగవేతకు సంబంధించి రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి కుమారుడు, అల్లుడితో పాటు వారి కాలేజీలకు చెందిన పదమూడు మంది ప్రిన్సిపళ్లు, ఇతర కార్యాలయ సిబ్బందిని ఆదాయపు పన్ను (ఐటీ) శాఖాధికారులు సోమవారం విచారించారు. ఇటీవల మల్లారెడ్డి, ఆయన కుటుంబీకులకు చెందిన ఇంజినీరింగ్, వైద్య కళాశాలలతో పాటు వారి నివాసాల్లో ఐటీ అధికారులు రెండ్రోజుల పాటు సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. భారీ ఎత్తున సాగిన ఈ సోదాల్లో మల్లారెడ్డి అల్లుడితో పాటు బంధువుల ఇండ్ల నుంచి రూ. 10.50 కోట్లను స్వాధీనపర్చుకున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా, పన్ను ఎగవేతకు సంబంధించి తదుపరి విచారణకు హాజరు కావాలని తెలిపిన ఐటీ అధికారులు.. మల్లారెడ్డి మొదలుకొని ఇతర కుటుంబసభ్యులు, బంధువులకు నోటీసులను జారీ చేశారు. ఈ మేరకు సోమవారం మంత్రి కుమారుడు భద్రారెడ్డి, అల్లుడు రాజశేఖర్ రెడ్డిలతో పాటు వారి కాలేజీలకు చెందిన పదమూడు మంది ప్రిన్సిపళ్లు, వారి కార్యాలయాల అధికారులు ఐటీ ఆఫీసర్ల ఎదుట హాజరయ్యారు. వీరిని దాదాపు ఆరు గంటల పాటు ఐటీ అధికారులు విచారించారు. ముఖ్యంగా, వీరి పర్యవేక్షణలో సాగుతున్న కాలేజీల ఆర్థిక లావాదేవీలు, వారు చెల్లించిన ఆదాయపు పన్ను, గత రెండు, మూడు సంవత్సరాల్లో కాలేజీలకు వచ్చిన ఆదాయం తదితర వివరాలను వీరి నుంచి సేకరించినట్టు తెలిసింది. ఇదిలా ఉంటే, తాము నడిపిస్తున్న కాలేజీలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీల గురించి ఐటీ అధికారులు తమను విచారించారని మంత్రి కుమారుడు భద్రారెడ్డి, అల్లుడు రాజశేఖర్ రెడ్డిలు విచారణానంతరం మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. ఐటీ అధికారులు అడిగిన వివిధ అకౌంట్‌ల గురించి సమాచారాన్నిచ్చామని వారు తెలిపారు. ఇంకా ఏదేనీ సందేహాలుంటే తమ ఆడిటర్లతో మాట్లాడి పూర్తి వివరాలను అందజేస్తామని అధికారులకు తాము చెప్పినట్టు భద్రారెడ్డి, రాజశేఖర్ రెడ్డిలు చెప్పారు. అందులో భాగంగా తమ అధికారులు కూడా వచ్చి ఐటీ అధికారులు అడిగిన ప్రశ్నలకు జవాబులిచ్చారని వివరించారు. ఈ విధంగా ఐటీ అధికారుల విచారణ డిసెంబర్ 3 వరకు కొనసాగనుందని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వంతో ఒంటరియో ప్రావిన్స్ ఒప్పందం

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో కెనడాకు చెందిన ఒంటరియో ప్రావిన్స్ ఒప్పందం కుదుర్చుకుంది. న్యూఢిల్లీలో జరిగిన ఈ ఒప్పందంలో రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, కెనడా ఆర్థికాభివృద్ధి అండ్ వాణిజ్య శాఖ మంత్రి విక్ ఫెడెలి పాల్గొన్నారు. దీంతో ఇవి, ఏరోస్పేస్, మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల్లో సహకారం కోసం 2016లో కుదుర్చుకున్న ఒప్పందం పొడిగించబడినట్లయ్యింది.

ఫూలే పేరుతో 310 గురుకులాలు

- మంత్రి గంగుల కమలాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మహాత్మా జ్యోతిబాఫూలే పేరుతో 310 గురుకుల పాఠశాలలను ప్రభుత్వం నిర్వహిస్తున్నదని మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. ఫూలే వర్ధంతి సందర్భంగా బలహీన వర్గాల కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ సోమవారం మంత్రి నివాళులర్పించారు. ఫూలే ఆశయాలతో సిఎం పాలన సాగిస్తున్నారని తెలిపారు. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్రంలో310 బిసి గురుకులాలను ఏర్పాటు చేశామని తెలిపారు. విదేశీ విద్యకు సంబంధించి అత్యున్నతమైన విధానాన్ని ప్రభుత్వం అవలంభిస్తున్నదని తెలిపారు. హైదరాబాద్‌లో వేల కోట్ల విలువైన 87 ఏకరాలను 41 బిసి కులాలకు కేటాయించిందని తెలిపారు.

నందు భార్యను విచారించిన సిట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో మూడో నిందితుడైన నందకుమార్ భార్య చిత్రలేఖను ప్రత్యేక దర్యాప్తు బృందం సోమవారం మరోసారి విచారించింది. ఈ సారి దాదాపు ఎనిమిది గంటల పాటు ఆమెను అధికారులు విచారించారు. నందకుమార్ భార్యగా ఆయన వ్యాపార లావాదేవీలతో ఆమెకున్న సంబంధాల పైనా సిట్ అధికారులు ప్రత్యేకంగా ఆరా తీసినట్టు తెలిసింది. ముఖ్యంగా, ఈ కేసులో ప్రధాన నిందితుడైన రామచంద్ర భారతి, రెండో నిందితుడు సింహయాజితో ఉన్న పరిచయం మొదలుకొని ఎమ్మెల్యేల కొనుగోళ్ల విషయమై నందకుమార్‌కు వారితో ఉన్న సంబంధాలపైనా సిట్ అధికారులు విచారించారని తెలిసింది. ముఖ్యంగా, ఈమె బ్యాంకు అకౌంటు ద్వారా రామచంద్ర భారతి, సింహయాజి స్వామి నందకుమార్ అకౌంట్‌లకు జరిగిన డబ్బు లావాదేవీ పైన క్షుణ్ణంగా ఆరా తీసినట్టు తెలిసింది.

బిసిల న్యాయమైన వాటాకోసం పోరాటం

- డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అన్ని రంగాల్లో బిసిలకు న్యాయమైన వాటా కోసం బిఎస్‌పి ఆధ్వర్యంలో పోరాటం నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించామనీ, అందుకు స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బిసి జనగణన, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల పెంపు గురించి రాష్ట్ర బిజెపి నేతలు కేంద్రాన్ని ఎందుకు అడగటం లేదని ప్రశ్నించారు. మహాత్మ జ్యోతిరావు ఫూలే వర్ధంతి సందర్భంగా గులాంగిరి చేయకుండా బిసిల న్యాయమైన వాటా కోసం పోరాడాలని సోమవారం ట్విట్టర్ వేదికగా పిలుపునిచ్చారు.

రామోజీ గోడలు బద్దలుకొట్టి ఇళ్లు నిర్మిస్తాం

- లాఠీ దెబ్బలకు ఉద్యమం ఆగదు
- ముదిగొండ అమరుల స్ఫూర్తితో పోరాడతాం
- స్వప్నం చేసిన ఫిలిం సిటీ భూబాధితులు
- సిపిఎం జిల్లా కార్యదర్శి కె. భాస్కర్‌ను ఈడ్చుకెళ్లిన ఖాకీలు
- ఆగ్రహించిన బాధితులు, కార్యకర్తలు

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదలకు చెందాల్సిన ప్రభుత్వ భూములను రామోజీరావుకు అప్పన్నంగా కట్టబెడుతామంటే ఊరుకునేది లేదని, పేదలకు భూమిదక్కే వరకూ పోరాడుతామని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు నాగయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని నాగన్‌పల్లి, పొల్కంపల్లి, రాయపోల్ గ్రామాలకు చెందిన ఇండ్లు లేని నిరుపేదల కోసం నాటి ప్రభుత్వం 2007లో నాగన్‌పల్లి రెవెన్యూ పరిధిలో 189, 203 సర్వే నెంబర్‌లో సుమారు 20 ఎకరాల్లో 600 మంది పేదలకు ఇంటి జాగాలు కేటాయించింది. ఈ జాగాలపై రామోజీరావు కన్నేసి కాజేయాలని చూస్తూ తమ జాగాలోకి రాకుండా అడ్డగిస్తున్నారని బాధితులు మండిపడ్డారు. ఈ జాగాలను పేదలకు ఇవ్వాలని సిపిఎం రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాలుగు గ్రామాల ప్రజలు సుమారు 1000 మందితో సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పేదల పొట్టకొట్టేందుకు కుట్రలు చేస్తున్న రామోజీరావుపై చర్యలు తీసుకోవాలని, రెవెన్యూ అధికారులు రామోజీరావుకు ఊడిగం చేయడం ఆపి.. పేదలకు న్యాయం చేయాలని, ప్రాణాలైనా ఇచ్చి తమ జాగాల కోసం పోరాడుతామని బాధితులు దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. ఈ క్రమంలో కలెక్టర్ కార్యాలయంలోకి చొచ్చుకుపోయే ప్రయత్నం చేశారు. దాంతో అప్రమత్తమైన పోలీసులు నాయకులను అరెస్టు చేసేందుకు యత్నించగా బాధితులు, పోలీసుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది.

ఈ క్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి భాస్కర్‌ను పోలీసులు ఈడ్చుకెళ్లారు. ఆగ్రహానికి గురైన భూ బాధితులు, సిపిఎం కార్యకర్తలు పోలీసులతో ఘర్షణకు దిగారు. ఇరువురి మధ్య తోపులాట జరిగింది. పోలీసు ఉన్నతాధికారుల జోకంతో ఘర్షణ వాతావరణం సద్దుమణిగింది. అనంతరం సిపిఎం బృందంతోపాటు బాధితులు జిల్లా అదనపు కలెక్టర్ తిరుపతిరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేని పేదోడికి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇస్తామని చెప్పి ఎనిమిదేండ్లు అయినా ఇప్పటికీ జిల్లాలో ఒక్కటంటే ఒక్క ఇల్లు కూడా ఇచ్చింది లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లు ఇవ్వకపోగా గత ప్రభుత్వాలు ఇంటి నిర్మాణాల కోసం ఇచ్చిన ఇంటి జాగాలు ప్రయివేటు వ్యక్తులకు అప్పన్నంగా అంటగడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటి ప్రభుత్వం ముదిగొండలో ఏడు మంది ప్రాణాలు బలిగొన్న తరువాతే రాష్ట్ర వ్యాప్తంగా ఇండ్ల జాగాలు పంపిణీ చేసిందని, ఇప్పుడు మీకు ఎన్ని ప్రాణాలు కావాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీరయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వ భూములను కబ్జాలు పెట్టి అనుభవిస్తున్నప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 44 కేంద్రాల్లో వేలాది మంది పేదలు ఇంటి జాగాల కోసం ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసి నివాసం ఉంటున్నారన్నారు. ప్రభుత్వాలు ఉంది ప్రజల కోసం తప్పా బడా పెట్టుబడిదారులకు ఊడిగం చేయడానికి కాదని హెచ్చరించారు.

తమ పట్టా జాగాలను తమకు కావాలని పోరాటం చేస్తున్న పేదలపై దాడులు చేయడం సరికాదన్నారు. పోలీసుల లాఠీ దెబ్బలకు, అరెస్టులకు భయపడేవారు ఎవరూ లేరని స్పష్టం చేశారు. పేదలకు భూమి దక్కే వరకూ పోరాడుతామన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కె.భాస్కర్, కార్యదర్శి వర్గ సభ్యులు సామెల్, జగదీశ్, జిల్లా నాయకులు జంగయ్య, జగన్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం తెలంగాణకే మణిహారం

- మంత్రి కొప్పుల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ట్యాంక్‌బండ్ ఒడ్డున ఏర్పాటు చేస్తున్న 125 అడుగుల అంబేద్కర్ భారీ విగ్రహం తెలంగాణకే మణిహారంగా నిలుస్తుందని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డితో కలిసి సోమవారం ఆయన విగ్రహ నిర్మాణ పనులను పరిశీలించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి పనులను పూర్తి చేస్తామని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో జనరంజక పాలనను అందిస్తున్నామన్నారు. విగ్రహం అడుగు భాగంలో పార్లమెంట్ తరహా నిర్మాణాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. కింది భాగంలో అంబేద్కర్ ఫొటో గ్యాలరీతో పాటు ఆయన గొప్పతనం, జీవిత చరిత్రకు సంబంధించిన వివిధ అంశాలు, పుస్తకాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఇందులో సినిమా థియేటర్ కూడా ఉంటుందని చెప్పారు. విగ్రహ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని వివరించారు. వచ్చే ఏడాది అంబేద్కర్ జన్మదిన వేడుకల సందర్భంగా విగ్రహాన్ని ప్రారంభించనున్నట్టు మంత్రి తెలిపారు.

గొత్తికోయలను వెళ్లగొట్టడం రాజ్యాంగ విరుద్ధం

- సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా, ఎఐకెఎంఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం ఎర్రబోడులో ఫారెస్టు అధికారి చలమల శ్రీనివాసరావు అవాంఛనీయ హత్యను సాకుగా తీసుకుని ఆ ప్రాంతం నుంచి గొత్తికోయలను వెళ్లగొట్టాలంటూ నోటీసులివ్వడం రాజ్యాంగ విరుద్ధమని సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా, ఎఐకెఎంఎస్ విమర్శించాయి. ఈ మేరకు ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గొత్తికోయలు ఈ దేశపౌరులనీ, రాజ్యాంగంలోని 19వ ఆర్టికల్‌లోని ఐదో షెడ్యూల్ ప్రకారం వారు ఎక్కడైనా జీవించే అవకాశాన్ని రాజ్యాంగాన్ని కల్పించిందని గుర్తు చేశారు. ఇది ఆధునిక పౌర సమాజం ఇచ్చిన జీవించే హక్కని తెలిపారు. వారు అత్యంత వెనుకబడిన వారు కాబట్టి వెళ్లగొట్టడం దుర్మార్గమని విమర్శించారు. గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ వారిని వెళ్లగొట్టాలనడం విడ్డూరంగా ఉందని తెలిపారు. 1970 తర్వాతే లంబాడాలను ఎస్‌టి జాబితాలోకి తీసుకున్నారనీ, గొత్తికోయలను పౌరులుగా గుర్తించకపోవడం శోచనీయమని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కుకనుగుణంగా గొత్తికోయలకు భూమితోపాటు జీవన భద్రతను కల్పించాలని డిమాండ్ చేశారు.

దేశం గర్వించదగిన మహనీయుడు ఫూలే

- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశం గర్వించదగిన మహానీయుడు మహాత్మా జ్యోతిరావు ఫూలే అని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు తెలిపారు. సోమవారం ఫూలే వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ 1890 నవంబర్ 28న ఫూలే మరణించాడనీ, అయితే ఆయన చూపిన మార్గం మాత్రం ఇప్పటికీ సజీవంగా ఉందన్నారు.

స్వతంత్ర దృష్టి, సమగ్ర దృక్పథం, ఆధునిక సమాజపు ఆకాంక్షకు ప్రతీక ఫూలే అని చెప్పారు. ఆయన రచనలు, ఉపన్యాసాలు జీవితాంతమంతా ప్రత్యక్ష అనుభావాలతో నిండి ఉన్నదని తెలిపారు. కులవివక్షను ప్రత్యక్షంగా అనుభవించిన ఆయన, తాను ఎదుర్కొన్న అవమానాలను రూపుమాపడానికి తుది శ్వాస వరకు కృషి చేశాడని చెప్పారు. ఒక బ్రాహ్మణ మిత్రుడి వివాహ ఊరేగింపులో పాల్గొన్నందుకు బ్రాహ్మణులు ఆయన పట్ల చూపిన వివక్షతో కంటనీరు పెట్టాడని తెలిపారు. వితంతువు పునర్వివాహాలు, అస్పృశ్యులకు విద్య, పేదల సంక్షేమం కోసం తుది శ్వాస వరకు ఫూలే దంపతులు కృషి చేశారన్నారు. ఇలాంటి అంతరాలను అంతం చెయ్యడానికి శూద్ర, అతి శూద్ర ప్రజలకోసం జీవితాన్ని అంకితం చేయాలనీ, బ్రాహ్మణీయ ఆధిపత్య భూస్వామ్య వ్యవస్థను అంతం చెయ్యకపోతే శూద్రుల మనుగడకు ప్రమాదం ఉందంటూ ఆయన గుర్తించారని గుర్తుచేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి సర్కార్ నూతన విద్యావిధానం ముసుగులో కాషాయికరణ, కార్పొరేటీకరణను జొప్పించడం ద్వారా మార్చి మెజార్టీ ప్రజలకు విద్యకు దూరం చేస్తున్నదని తెలిపారు. ఆ విధానానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోట రమేష్, ఎ వెంకటేశ్ ప్రసంగించారు. కెవిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గంటేపోగు రాజు రాష్ట్ర కమిటీ సభ్యులు , బొరుసు మారన్న, పరంజ్యోతి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు తీరు మార్చుకోవాలి

- జాతీయ ఎస్‌సి కమిషన్ వైస్ చైర్మన్ అరుణ్ హల్దర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్‌సి మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై పోలీసులు తక్షణం స్పందించాలనీ, కేసులను కఠినంగా నమోదు చేయాలని జాతీయ ఎస్‌సి కమిషన్ వైస్ చైర్మన్ అరుణ్ హల్దర్ అన్నారు. ఈ విషయంలో పోలీసులు తమ తీరును తప్పనిసరిగా మార్చుకోవాల్సిందేనని చెప్పారు. సోమవారంనాడిక్కడి ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి) ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్‌సిలపై దాడులు, అఘాయిత్యాల్లో రాజస్థాన్ మొదటి స్థానంలో ఉన్నదనీ, ఉత్తరప్రదేశ్‌లోనూ కేసుల తీవ్రత ఎక్కువగా ఉందన్నారు. తెలంగాణలో ఈ ఏడాదిలో 26 అట్రాసిటీ కేసుల్లో 22 కేసుల్లో తక్షణం న్యాయం లభించేలా చర్యలు తీసుకున్నామన్నారు. లైంగికదాడి, మోసం కేసుల్లో మూడ్రోజుల్లో చర్యలు తీసుకోవాలనీ, నిందితులను అరెస్టు చేయాలని సంబంధిత పోలీసులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. భూసేకరణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వారికి నష్టపరిహారం ఇచ్చే విషయంలో అన్యాయం జరుగుతున్నదన్నారు. సేకరించిన భూమిని ప్రభుత్వాలు ప్రయివేటు సంస్థలకు అమ్ముకుంటున్నాయనీ, అందువల్ల బాధితులకు మెరుగైన పరిహారాలు అందించాల్సిందేనని స్పష్టంచేశారు. దళితులకు మూడెకరాల భూ పంపిణీ హామీ అమలుపై రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అయితే దాన్ని సుమోటోగా స్వీకరించడంపై ఆలోచిస్తామన్నారు.

భారత్‌కు అమెజాన్ మరో దెబ్బ

- మూడో వ్యాపారం మూత

న్యూఢిల్లీ : భారత్‌లో తన మరో వ్యాపారాన్ని మూసివేస్తున్నట్లు గ్లోబల్ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ప్రకటించింది. ఇటీవలే అమెజాన్ తన ఫుడ్ డెలివరీ, ఎడ్‌టెక్ సర్వీసెస్ అమెజాన్ అకాడమీని మూసివేస్తున్నట్లు ప్రకటించగా.. తాజాగా తన హోల్‌సేల్ డిస్ట్రిబ్యూషన్ సేవలను నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది. ఇది డిస్ట్రిబ్యూషన్ యూనిట్ కంపెనీల నుండి వినియోగదారులకు, రీటైలర్లకు సంబంధిత ఉత్పత్తులను డెలివరీ చేస్తుంది. ఆర్థిక మందగమనం నేపథ్యంలో డిస్ట్రిబ్యూషన్ సర్వీస్ సేవల్ని నిలిపివేస్తున్నట్లు చెప్పింది. దీంతో కేవలం వారం రోజుల్లోనే మూడు వ్యాపారాలను రద్దు చేసినట్లయ్యింది. నవంబరు 24న అమెజాన్ ఎడ్యుటెక్‌ను, ఫుడ్ డెలివరీని 25న మూసివేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. డిసెంబరు 29 నుంచి అమెజాన్ ఫుడ్ సర్వీసులు అందుబాటులో ఉండవని ప్రకటించింది.

అమ్మకానికి ట్విట్టర్ ఖాతాదారుల వివరాలు

వాషింగ్టన్ : ట్విట్టర్‌కు చెందిన ఖాతాదారుల వివరాలను తస్కరించి ఆ సంస్థ చీఫ్ ఎలన్ మస్క్‌కు హ్యాకర్లు షాక్ ఇచ్చారు. దాదాపుగా 50.4 లక్షల మంది ఖాతాదారుల సమాచారాన్ని హ్యాకర్లు అమ్మకానికి పెట్టారని బ్లీపింగ్ కంప్యూటర్ వెబ్‌సైట్ ఓ రిపోర్టులో వెల్లడించింది. ఇంటర్నెట్ బగ్ సాయంతో డేటాను దొంగిలించారు. అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్ ద్వారా మరో 10 లక్షల మంది ఖాతాదారుల వ్యక్తిగత వివరాలను దొంగలించారు.ట్విటర్ ఐడిలు, ప్రాంతాలు, పేర్లు, లాగిన్ పేర్లు లాంటి సమాచారంతో పాటు, ఫోన్ నంబర్లు, ఇమెయిల్ అడ్రస్‌లు సహా ఇతర ప్రయివేటు డేటాను హ్యాకర్లు కొట్టేశారు. ఈ వివరాలను హ్యాకర్‌వన్‌బగ్ బౌంటీ ప్రోగ్రామ్ అనే ఆన్‌లైన్ వేదికలో అమ్మకానికి పెట్టారు. 2021 డిసెంబర్‌లో డేటాను కాజేశారని బ్లీపింగ్ కంప్యూటర్ నివేదిక వెల్లడించింది. 'అమెరికా, యూరప్ దేశాలకు చెందిన ట్విట్టర్ ఖాతాదారుల డేటా దొంగలించడం గురించి హ్యాకర్ల బారిన పడిన కొందరు ఖాతాదారులతో మాట్లాడాను. తమ వివరాలను హ్యాకర్లు కాజేశారని వాళ్లు చెప్పారు.' అని ట్విట్టర్ సెక్యూరిటీ నిపుణుడు చాడ్ లోడర్ ముందుగానే హెచ్చరించారు. దీన్ని పట్టించుకోని ట్విట్టర్ యాజమాన్యం పైగా లోడర్‌ను తొలగిస్తూ నిర్ణయం తీసుకోవడం ఆందోళనకరం.

లిషియస్‌కు జూనియర్ ఎన్‌టిఆర్ ప్రచారం..

బెంగళూరు : మాంసం. సముద్రపు ఉత్పత్తులను విక్రయించే డి2సి బ్రాండ్ యునికార్న్ లిషియస్ తన వినియోగదారులకు మరింత చేరువ కాడానికి ప్రముఖ హీరో జూనియర్ ఎన్‌టిఆర్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ సంస్థ ఉత్పత్తులకు ఎన్‌టిఆర్ ప్రచారం చేయనున్నారు. "ఈ ప్రాజెక్ట్ కోసం సూపర్ స్టార్ జూనియర్ ఎన్‌టిఆర్‌తో భాగస్వామి కావడం మాకు చాలా సంతోషంగా ఉంది. ఆయన పేరు మాస్‌తో ప్రతిధ్వనించే, నిరాడంబరమైన ఆకర్షణ. నత్రాస్ ఖర్చుతో కూడుకున్నప్పటికీ, ఉత్తమమైన నాణ్యమైన మాంసాన్ని అందించేందుకు మా సిబ్బంది, అంకితభావానికి సంబంధించిన వివరాలను ఈ క్యాంపెయిన్ వివరిస్తాం." అని లిషియస్ బ్రాండ్ ఉపాధ్యక్షుడు సంతోష్ హెగ్డే పేర్కొన్నారు.